ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025





ఎట్టకేలకు చేపట్టారు..

- జలాశయాల్లోకి మీనం..
- ఈనెల 20లోగా పంపిణీకి గడువు
- చేప పిల్లల పంపిణీ లక్ష్యం 1.48 కోట్లు
- గత సంవత్సరం 46.71 లక్షలు పంపిణీ
- జిల్లాలో 168 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటునిచ్చే ఉచిత చేప పిల్లల పంపిణీ ఎట్టకేలకు చేపట్టారు. రాష్ట్రంలో ఈనెల 20లోగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పూర్తిచేసే దిశగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జలాశయాల్లోకి చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌లు మల్కపేట ప్రాజెక్టులో ప్రారంభించారు. జిల్లాలో ఈనెల 14 తేదీలోపే ప్రక్రియ పూర్తిచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభంలోనే ప్రాజెక్టులు, చెరువులు చేప విత్తనాలను వదలాల్సి ఉంది. పూర్తిగా వంద శాతం రాయితీతో చేప పిల్లల పంపిణీకి ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలలోనే చేప పిల్లల టెండర్ల ప్రక్రియ పూర్తిచేసేవారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు చెరువులు కుంటలు ప్రాజెక్టులలో నీటిలో సామర్థ్యాన్ని బట్టి చేప పిల్లలను వదిలేవారు.



చేపపిల్లలను వదులుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

ఈ సారి వర్షాకాలం సీజన్ రుతుపవనాలు సకాలంలో వచ్చిన ప్రారంభంలో అనుకూలమైన వర్షాలు కురవకపోవడంతో టెండర్ల ప్రక్రియ చేపట్టలేదు. అల్పపీడన ప్రభావంతో ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో చెరువులు. ప్రాజెక్టులోకి నీరు చేరి జలకళ సంతరించుకుంది. చేప విత్తనాల పంపిణీ జాప్యంపై మత్స్యకారుల నుంచి వచ్చిన డిమాండ్, నిరసనలతో చివరకు టెండర్లకు ఆహ్వానించారు. గత నెలలో ఎట్టకేలకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి చేపపిల్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఈనెల 20లోగా చేప పిల్లల పంపిణీ జలాశయాల్లో విడుదల చేయాలని నిర్ణయించడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం అవుతుంది.

నాలుగు రకాల చేప పిల్లల పంపణీ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 456 చెరువులు, కుంటలు, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టు, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, మల్కపేట ప్రాజెక్టులో 1.48 కోట్ల చేప పిల్లలను వదులుతున్నారు. నాలుగు రకాల చేప పిల్లలు ప్రధానంగా వేస్తున్నారు. బొచ్చె, రవులు, బంగారుతీగ, మేరియా రకాల పిల్లలను వదులుతున్నారు. 45 రోజుల వయస్సు కలిగిన 35 నుంచి 40 మిల్లీమీటర్లు, 75 రోజులు అంతకంటే ఎక్కువ వయసు ఉండే 80 నుంచి 100 మిల్లీమీటర్ల చేపపిల్లలను సిద్ధం చేసి వదులుతున్నారు. చేప పిల్లలు సకాలంలో వదలకపోవడంతో ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని మత్స్యకారులు అంటున్నారు.

చేపపిల్ల కిలో బరువు పెరగాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలై నెలలో చేప పిల్లలు వదిలితే డిసెంబరు నుంచి వేటాడడానికి అనుకూలంగా ఉండేదని మత్స్యకారులు వాపోతున్నారు. గత ఏడాది ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ఆలస్యంగా మొదలుపెట్టింది. కాంట్రాక్టర్లు కూడా

మిగతా 8వ పేజీలో..

చెరువుల్లో చేపపిల్లలు వదిలిన తీరు..

సంవత్సరం	చెరువులు, కుంటలు	వదిలినవి
2016-17	92	30.5 లక్షలు
2017-18	66	20 లక్షలు
2018-19	95	57.48 లక్షలు
2019-20	313	100.91 లక్షలు
2020-21	362	115.61 లక్షలు
2021-22	392	119.25 లక్షలు
2022-23	392	138.27 లక్షలు
2023-24	440	141.00 లక్షలు
2024-25	324	46.71 లక్షలు
2025-26	456	148.45 లక్షలు

ఈసారి జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఇలా..

మండలం	చెరువులు	చేప పిల్లల సీడ్
గంభీరావుపేట	52	22,33,388
ముస్తాబాద్	35	9,44,877
సిరిసిల్ల	17	3,77,446
తంగళ్లపల్లి	38	6,59,799
వీర్నపల్లి	18	3,53,766
ఎల్లారెడ్డిపేట	45	8,99,871
చందుర్తి	33	8,37,756
కోనరావుపేట్	55	17,03,465
రుద్రంగి	07	1,00,950
వేములవాడ	25	4,10,427
వేములవాడ రూరల్	27	4,89,019
బోయిన్‌పల్లి	36	33,07,878
ఇల్లంతకుంట	68	25,26,837
మొత్తం	456	1,48,45,479

వెన్నెల మెరిసె... రాజన్న మురిసె



రాజన్న ఆలయంపై నుంచి కనిపించిన పౌర్ణమి చంద్రుడు

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా నిండుపున్నమి వేళ వెన్నెల మెరువగా.. వేములవాడ రాజన్న మురిసిండు. బుధవారం రాత్రి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం చెంతన చంద్రుడు నిండు జాబిలై గోపురాల చెంతన చేరడంతో భక్తులు తన్మయత్వంతో తిలకించారు.

మొలకెత్తుతున్న ధాన్యం..

ఎల్లారెడ్డిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు తీసుకు వచ్చిన ధాన్యం తడిసిపోయి ఇలా మొలకొస్తోంది.. వానకు తడిసిపోయి కింద ఉన్న ధాన్యం మొలకొచ్చింది. తూకం వేయడంలో జాప్యం వల్ల ధాన్యం మొలకొస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

చందుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందుర్తి, రామన్నపేట శివారులోని అటవీప్రాంతంలో వెలిసిన వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆయాచితుల పవన్ కుమార్ కల్యాణోత్సవంతో పాటు హోమం కార్యక్రమాలను వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. వేములవాడ నియోజక బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మడ లక్ష్మీనరసింహారావు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దుమ్మ అంజయ్య, మాజీ ప్రజాప్రతినిదులు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, చిలుక పెంటయ్య, రాపెల్లి గంగాధర్, నాయకులు మ్యాకల ఎల్లయ్య, పోతరాజు నగేష్, ఈర్లపల్లి రాజు, మొతె రాములు, భైరగొని రమేష్, మార్త సత్తయ్య, బత్తుల కమలాకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, ఇస్మాయిల్, సిరికొండ మల్లయ్య, తిప్పని అజయ్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, నవంబరు5(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. మండలంలోని బాకురుపల్లితండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల గడప ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన ప్రతి పేదకు ఇంటిని కేటాయించిందన్నారు. దశలవారిగా పనులు పూర్తయిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులను జమచేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. మండలంలో మొత్తం 642 ఇళ్లు మంజూరవగా 100 ఇళ్లు చివరి దశకు చేరుకున్నాయన్నారు. రెండోదశలో 95 ఇళ్లను ప్రభుత్వం కేటాయించనుందన్నారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, బుచ్చాగౌడ్, రవీందర్, దేవేందర్, రాంసింగ్, సత్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంతలో కనీస సౌకర్యాలు కరువు..



గంభీరావుపేటలో అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న సంత

గంభీరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కూరగాయల సంత సౌకర్యాల లేమితో క్రయ విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు నిత్యం వస్తుంటారు. అప్పట్లో ఉన్న మార్కెట్ షెడ్డును కొత్త సమీకృత మార్కెట్ నిర్మాణంలో భాగంగా కూల్చేశారు. కొత్తది నిర్మాణం గాక, పాతది కూల్చేయడంతో అసౌకర్యాల మధ్య రోడ్డుపక్కన మార్కెట్ కొనసాగుతోంది. వానలో నానుతూ ఎండలో ఎండుతూ క్రయవిక్రయదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నర్మాల మానేరు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కను సంత కొనసాగుతుండటంతో ఒక్కొసారి ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. ఇప్పటికైనా నూతన మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలని, అప్పటివరకు సంతలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని క్రయవిక్రయదారులు కోరారు.

షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లో కొనుగోలు చేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడుతామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు అన్నమో రామచంద్ర అనే పరిస్థితులో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నిలిచిపోవడంతో కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం మొలుకలు రావడంతో రైతులు గోస పడుతున్నారన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు అకాల వర్షాలు పడుతుంటే మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, అధికారులు తేమ శాతం పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు నిరీక్షిస్తున్నారని అన్నారు. రైతులు కష్టాలు, బాధలను అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మునిగిపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం చరిత్రలో బాగుపడలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కళ్లు తెరిచి రాష్ట్ర ప్రభుత్వం తేమశాతం నిబంధనలు లేకుండా జిల్లాలోని మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోన్నాల తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మండలాల అధ్యక్షులు బూర శేఖర్, మిర్యాల్‌కర్ బాలాజీ, సోల్ల క్రాంతికుమార్, రేపాక రామచంద్రం, పరమేష్, మొకిలి విజేందర్, కొడే రమేష్, లక్పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు వైభవంగా జ్వాలా తోరణం
- భీమేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం 7

రుద్రంగిలో ఘనంగా లక్ష్మీనర్సింహ స్వామి జాతర



స్వామివారి దర్శనానికి భారులు తీరిన భక్తులు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

రుద్రంగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రహ్లాదపర్వతంపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భక్తులు బారులు తీరారు. ప్రతిసంవత్సరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రుద్రంగిలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్వామివారి తీరునాళ్ల, గరుడ సేవా, రాత్రి సమయంలో నిత్యవైష్ణవులతో యక్షజ్ఞానం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి కోవెలపై భక్తులు బారులుతీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ చైర్మన్ కొమిరె శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులు లక్ష్మీనర్సింహస్వామివారికి కట్నకానుకలు సమర్పించారు. మహిళలు స్వామివారికి ఒడి బియ్యాన్ని సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అలాగే వేములవాడ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి సందర్శించి ఆలయంలో దీపాలు వెలిగించారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గుంతలతో వాహనదారుల ఇబ్బందులు..

వేములవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం కోరుట్ల బస్టాండు నుంచి మల్లారం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లారం రోడ్డులో కట్టుకాలువ పైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం హైట్‌లో ఉండటంతో బీటీ రోడ్డుకు అనుకునేలా మొరం పోయించాల్సిన అధికారులు నామమాత్రంగా వ్యవహరించడంతో గుంతల మయంగా మారింది. కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురికావడంతో బ్రిడ్జి పైకి వెళ్లే ముందు, బ్రిడ్జి దిగే ముందు వాహనదారులు నరకయాతనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతులు చేసి వాహనదారుల ఇబ్బందులకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

ఇళ్లలోకి వస్తున్న దుమ్ము, ధూళి..

మల్లారంరోడ్డులోని కట్టుకాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో బ్రిడ్జి సమీపంలోని ఇళ్లలోకి దుమ్ము, ధూళి వచ్చి చేరుతోందని స్థానిక ఇళ్ల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేసినప్పటికి మట్టి సరిగా పోయకపోవడంతో రోడ్డుగుండా వచ్చి, వెళ్లే వాహనాలతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతోందని చెబుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేయండంతో తమకు ఇబ్బందిగా మారిందని, బ్రిడ్జికి రెండువైపుల బీటీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బ్రిడ్జి వద్ద గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

దేదీప్యమానం..





- జిల్లా వ్యాప్తంగా కార్తీక శోభ..
- వెల్లివిరిసిన భక్తిభావం
- శివుడికి నీరాజనం
- కిటకిటలాడిన ఆలయాలు


సిరిసిల్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాల్లో దీపాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. శివనామస్మరణతో మార్మోగాయి. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో బుధవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శివాలయాల్లో పౌర్ణమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో కార్తీక పౌర్ణమి సందడి కనిపించింది. తెల్లవారుజామునే జిల్లా కేంద్రంలోని శివాలయాల్లోకి వెళ్లి అభిషేకాలు, క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీవిశ్వనాథ దేవస్థానం, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం, శివసాయిబాబా ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు, తులసి పూజలు, నోములను నిర్వహించుకున్నారు. శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ విశ్వనాథ దేవాలయం, శివాలయంలో మహిళలు దీపాలు వెలిగించి శివుడికి ప్రత్యేక పూజలు ప్రత్యేకంగా తులసి పూజలు నిర్వహించారు.











సిరిసిల్లలోని పలు దేవాలయాల్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, శివాలయాల్లో పూజలు, అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఆన్‌లైన్‌లో రూ.1.15లక్షల సైబర్ మోసం

- ఆకర్షణీయ వస్తువుల పేరుతో మహిళకు టోకరా

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షణీయమైన వస్తువులను తక్కువ ధరకే అందిస్తామంటూ మోసానికి పాల్పడుతున్న సైబర్ నేరస్థుల వలకు చిక్కి వేములవాడ పట్టణంలోని ఓ మహిళ మోసపోయింది. ఈ సంఘటనపై బాధిత మహిళ భర్త కొమ్ము నటరాజ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సామాజిక మాధ్యమంలో రూ. 999 కే ఆకర్షణీయమైన వస్తువులు విక్రయిస్తున్నట్లు ముందుగా పోస్ట్‌పెట్టారు. అది చూసిన బాధిత మహిళ సదరు నంబర్‌కు రూ.999 పంపింది. తర్వాత పలు దఫాలుగా ఆమె నుంచి మరి కొంత డబ్బులు రాబట్టారు. చాటింగ్ ద్వారా బాధిత మహిళ ఫోన్‌ను హ్యాక్ చేసి ఆమె ఖాతాలో ఉన్న రూ.1.15లక్షలు నగదు కాజేశారు. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్యాయత్నం

కోనరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాదరి మధుకర్ (48) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి భార్య రాధిక ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమరపల్లిలో మంగళవారం రాత్రి భీమరి భూమయ్య(87) అనే వృద్ధుడు ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ కిషన్ తెలిపారు. భూమయ్య ఐదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెందిన భూమయ్య మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అందని టార్పాలిన్లు

- అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



ఎండపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

ఎండపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చాక అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు మొంథా తుఫాన్ వల్ల కొన్ని గ్రామాల్లో వరి నేల మట్టం కాగా మరికొన్ని గ్రామాల్లో ధాన్యం తడిసి మొలకెత్తింది. ఎండపల్లి మండ కేంద్రంలో 20 రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. రైతులు నేరుగా



మార్కెట్‌లోకి ధాన్యాన్ని తరలిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో సొసైటీల ద్వారా, మరి కొన్ని గ్రామాల్లో ఐకేపీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల ద్వారా వచ్చిన కమీషన్‌తో టార్పాలిన్లు సమకూర్చాల్సి ఉన్నా అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రైతుల అవసరాలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయశాఖ ద్వారా 50 నుంచి 60 శాతం రాయితీపై అందించేది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

●రైతులపై ఆర్థిక భారం

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 60శాతం సబ్సిడీతో 1000 రూపాయలకే టార్పాలిన్ అందించేది. అనంతరం ఈ పథకం నిలిచిపోవడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. రైతులు పంటను కాపాడుకునేందుకు అత్యవసర పరిస్థితుల్లో వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వ్యాపారుల వద్ద టార్పాలిన్లను రోజుకు 30 నుంచి 40 రూపాయలు చెల్లించి రైతులు అద్దెకు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

-ఏవో మహేష్, ఎండపల్లి మండలం

రాయితీపై టార్పాలిన్లను అందించాలని రైతులు కోరుతున్నారు. పథకం రద్దయినట్టు రైతులకు చెబుతున్నా రాయితీపై టార్పాలిన్లు కావాలని అడుగుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే రైతులకు అందిస్తాం. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్తున్న సింగరేణి కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట ప్రదీప్‌కుమార్ (27) గాయపడ్డాడు. మంచిర్యాలకు చెందిన అడ్రియాల ప్రాజెక్టులో ప్రదీప్‌కుమార్ బదిలీవర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం తన ద్విచక్ర వాహనంపై గనికి వెళ్తున్న క్రమంలో సుందిల్ల మూలమలుపు వద్ద మంథని నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ప్రదీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

వీణవంక, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లికి చెందిన బోయిని లచ్చమ్మ (94) అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గతంలో లచ్చమ్మ కొడుకు మృతి చెందడంతో బాధతో ఉండేది. అక్టోబర్ 27వ తేదీన కొడుకు సమాధి వద్దకు వెళ్లి అక్కడే కార్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

విద్యార్థులకు గడ్డి మందు ఎక్కడిది ?

విచారణ చేపట్టిన అధికారులు

జమ్మికుంట రూరల్, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని ఎస్సీ పాఠశాలకు చెందిన ఇద్దరు తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రిన్సిపాల్ కొట్టాడని గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనలో విద్యార్థులకు గడ్డి మందు ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు మాత్రం పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డులోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గడ్డి మందు కొనుగోలు చేశామని పోలీస్‌లకు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఫర్టిలైజర్ దుకాణదారుడిని గుర్తించినట్లు సమాచారం. విద్యార్థులు కోలుకున్న వెంటనే ఫర్టిలైజర్ దుకాణదారుడిని పోలీస్‌లు అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది.

కిడ్నాప్ కలకలం

- కూతురి కిడ్నాప్‌నకు యత్నం.. తల్లిదండ్రులపై కేసు



బాధితురాలు ప్రియాంక

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి వద్ద బుధవారం కిడ్నాప్ కలకలం రేపింది. తన తల్లిదండ్రులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ బుధవారం ఓ యువతి వెల్గటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి ప్రియాంక అనే యువతి జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం రాజక్కపల్లి గ్రామానికి చెందిన మత్రి రాకేశ్ అనే యువకుడు ఆరు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో వీరి ప్రేమను ప్రియాంక తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఈ సంవత్సరం జూలై 27వ తేదీన ప్రియాంక, రాకేశ్‌లు పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. అయితే రాకేశ్ వేరే కులానికి చెందిన వాడు కావడంతో ప్రియాంక తల్లిదండ్రులు ఈ వివాహాన్ని వ్యతిరేకించారు. ప్రియాంక రాజక్కపల్లిలోని అత్తగారి ఇంట్లో భర్త రాకేశ్‌తో కలిసి ఉంటోంది. ప్రియాంకతో ఆమె తల్లిదండ్రులు తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ యోగక్షేమాలు తెలుసు కుంటున్నారు. గర్భవతి అయిన ప్రియాంకను ఆసుపత్రిలో చూపిస్తామని తల్లిదండ్రులు నమ్మించారు. బుధవారం జగిత్యాల ఆసుపత్రిలో ప్రియాంకకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. తిరుగు ప్రయాణంలో ఎండపల్లి మండలం రాజారాంపల్లి వద్ద దిగి రాజక్కపల్లి గ్రామానికి వెళ్లడానికి మరో బస్సు కొరకు వేచి ఉన్నారు. ఆ సమయంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ప్రియాంకను ఓ సమీప బంధువుతో కలిసి తల్లిదండ్రులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ప్రియాంక స్థానికుల సహాయంతో తప్పించుకుంది. తల్లిదండ్రులతో తనకు, భర్త రాకేశ్‌కు ప్రాణహాని ఉందని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు తల్లిదండ్రులు తమ్మిశెట్టి పద్మ, తమ్మిశెట్టి వెంకటేశ్, బాధితురాలి అక్క భర్త గుంజె కుమార్‌లపై వెల్గటూరు ఎస్ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే అని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను పేర్కొన్నారు. జిల్లా కేంద్రంకు చెందిన కంచెటి నారాయణ, నర్సమ్మ దంపతులను వారి కుమారులు పట్టించుకోవడం లేదు. దీంతో వృద్ధులు హరిఅశోక్‌కుమార్‌ను కలువగా రాత్రి తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. మరుసటి రోజు బుధవారం ఉదయం నర్సమ్మ, నారాయణ కుమారులను, కోడళ్లను అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ వృద్ధ దంపతుల కొడుకులు, కోడళ్లు క్షమాపణ చెప్పి, సమ్మతి పత్రంను అసోసియేషన్‌కు రాసిచ్చి వారిని ఇంటికి తీసుకొని వెళ్లారు. తమ న్యాయం చేసిన అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ వారు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం బుధవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 4 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేలు, సరస్వతీ కాలువకు 650, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడ్డ వీరాస్వామి, రామిరెడ్డి

సుల్తానాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుల్ల బ్రిడ్జిపైన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అయ్యప్పభక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వస్తున్న అయ్యప్పభక్తులను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మానకొండూరు మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన బత్తిని వీరస్వామి, నందికొండ రాంరెడ్డి అయ్యప్పమాల వేసుకోవడానికి బుధవారం ఉదయం లక్షెట్‌పేట సమీపంలోని గూడెంగుట్టకు వెళ్లారు. అక్కడ మాల వేసుకుని వేగురుపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల బ్రిడ్జి మీద కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరస్వామికి, రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా వీరస్వామికి తలకు తీవ్ర గాయాలై, మోకాలు కిందభాగం దెబ్బతినగా, రామిరెడ్డికి కుడి కాలు తొంటి విరిగింది. మెరుగైన చికిత్స కోసం వారిని కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి, ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

పోలీసుల అదుపులో జ్యూవెల్లరీ దొంగ

- బంగారం, వెండి, ఆటో, నగదు స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జమ్మికుంట రూరల్, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని జ్యూవెల్లరీ షాపుల్లో దొంగతానికి పాల్పడిన ఓ దొంగను పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్‌తో కలిసి హుజూరాబాద్ ఏసీపీ మాధవి దొంగతనానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన సోమ సారయ్య 2010లో తన భార్యను హత్య చేసిన సంఘటనలో జీవిత ఖైదు పడింది. జైల్లో తోటి ఖైదీలతో దొంగతనాలు చేసి సులభంగా డబ్బు సంపాధించవచ్చని తెలుసుకున్నాడు. సత్ప్రవర్తన కింద బయటకు వచ్చాడు. ప్యాసింజర్ ఆటో కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నాడు. ఆటో ద్వారా వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఇటీవల జమ్మికుంటలో రెండు జ్యూవెల్లరీ షాపులు, స్కూళ్లలో దొంగ తనాలు జరిగాయి. పోలీస్‌లు తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పద స్థితిలో సారయ్య పట్టుబడ్డాడు. పోలీసులు ప్రశ్నించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి కిలోన్నర వెండి, ఐదు తులాల భంగారం, రూ.38వేల నగదు, ప్యాసింజర్ ఆటో స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయిన అస్సాంకు చెందిన బాలుడి(17)ని కరీంనగర్ బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ), శిశు సంక్షేమ అధికారులు బుధవారం తల్లితండ్రులకు అప్పగించారు. అక్టోబరు 31న అస్సాంకు చెందిన బాలుడు ఇంట్లో గొడవలతో పారిపోయి కరీంనగర్ వచ్చాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 9490881098కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారి కుమారుడు కొత్తపల్లి మండలం బావుపేట గ్రానైట్ క్వారీలో ఉన్నట్టు తెలిపారు. వెంటనే సీఐ కోటేశ్వర్ సహాయంతో బాలుడినిని రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరిచారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, రాధ, విజయ్, డీసీపీవో పర్వీన్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, వర్కర్ మహేష్, సీడబ్ల్యూసీ డీఈవో అనూష,ఓపెన్ షెల్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

జూలపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరావుపేట గ్రామానికి చెందిన గుండ లలిత(45) అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు.. గుండ లలిత మూడేళ్ల క్రితం తీవ్రమైన అనారోగ్యానికి గురైనది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఆమెరోజు ఆందోళనకు గురియ్యేది. ఇక తన ఆరోగ్యం బాగుపడదేమోనని బాధతో జీవితంపై విరక్తి చెందిన లలిత వాష్‌రూంకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలు భర్త గుండ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

అనారోగ్య కారణాలతో వృద్ధుడి ఆత్మహత్య



రాజయ్య (ఫైల్)

కోనరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడిపల్లికి చెందిన పెడతనపల్లి రాజయ్య(85) అనే వృద్ధుడు అనారోగ్య కారణాల వల్ల జీవితం మీద విరక్తి చెంది బుధవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు కనకయ్య పోలీస్‌స్టేషన్‌లో అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఆరుగురు కుమారులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి రైల్వేగేట్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వల్లంపహాడ్ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముత్తారం మండలం ఓడేడులో..

ముత్తారం: మండలంలోని ఓడేడు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఓడేడు గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లను ఆపి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పాటు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్ఎంపీపై కేసు నమోదు



క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల గ్రామంలో ఆర్ఎంపీ కాసం రవీందర్‌రెడ్డి తగిన అర్హత లేకున్నా చట్ట విరుద్ధంగా క్లినిక్‌ను ఏర్పాటు చేసుకుని వైద్యం అందిస్తున్నాడని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ యెగ్గని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 5న నిర్వహించిన తనిఖీల్లో పోరండ్ల గ్రామంలో కాసం రవీందర్ రెడ్డి ఎంబిబి ఎస్ అర్హత లేకుండా చట్ట విరుద్ధంగా క్లినిక్ నడపుతున్నట్లు తేలింది. దీంతో అతనిపై జాతీయ వైద్య కమిషన్ చట్టం 2019(ఎన్ఎంసి యాక్ట్), రాష్ట్ర వైద్య చట్టాల ప్రకారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. నకిలీ వైద్యులను అరికట్టే దిశలో ఇది కీలకమైన అడుగు అని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లేదా ఎన్ఎంసీలో నమోదు పొందిన వైద్యులకే వైద్యం చేయడానికి హక్కు ఉందని, ప్రజలు, అధికార యంత్రాంగం అర్హత లేని వైద్యుల గురించి వెంటనే నివేదించాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు వెంట ధాన్యం.. తప్పిన ప్రమాదం



ధాన్యం కుప్పపైకి దూసుకెళ్లిన ట్రాలీ

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారు వద్ద ధర్మారం- పెద్దపల్లి ప్రధాన రహదారిపై రైతులు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోయడంతో మంగళవారం రాత్రి ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండల కేంద్రానికి చెందినవారు ట్రాలీలో పెద్దపల్లికి మొక్కజొన్నలు తీసుకెళ్లి విక్రయించి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్ప వద్దకు చేరుకోగానే ఎదురుగా లారీ రావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ధాన్యం కుప్పపైకి ట్రాలీ దూసుకెళ్లింది. ట్రాలీలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలైనట్లు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ పోలీసులు తెలిపారు.

ధాన్యం ఆరబోతలో వివాదం

- ముగ్గురిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోతకు ఇరు వర్గాల నడుమ చోటు చేసుకున్న స్థల వివాదంలో వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్ తండాకు చెందిన మాలోతు నిర్మల, భూక్య మంజుల అతని భర్త రవిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి మాలోతు నిర్మల, అదే గ్రామానికి చెందిన భూక్య మంజుల అతని భర్త రవిలు ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం కోసం గొడవకు దిగారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దంపతులు

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం టీఎన్‌జీవో రాష్ట్ర కోశాధికారి ముత్యాల సత్యనారాయణగౌడ్, మాలతి దంపతులు బుధవారం ఆలయ కార్యాలయంలో ఒక లక్ష రూపాయల విరాళం ఆలయ పర్యవేక్షకులు సంజీవ్ కుమార్‌కు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



రేవా రాష్ట్ర అడ్‌హక్ కమిటీ బాధ్యులు

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన రేవా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూవిటీ వంటివి అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే ఇవ్వాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ విరమణ బకాయిలు ఇచ్చే వరకు పోరాటం చేయాలని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం రేవా రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● రేవా రాష్ట్ర కన్వీనర్‌గా కోహడ చంద్రమౌళి (కరీంనగర్), కో కన్వీనర్లుగా భరత్ సత్యనారాయణ (హైదరాబాద్), సి.జయరాం (ఖమ్మం), ఎస్.ధర్మేంద్ర (వరంగల్), కోశాధికారిగా కె.భిక్షపతి (నల్గొండ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

11న అరుణాచలం, రామేశ్వరానికి

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్ డిపో నుంచి ఈ నెల 11న అరుణాచలం, రామేశ్వరానికి రెండు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. 11న మధ్యాహ్నం గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరే ఈ బస్సులు కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, పాతాళశంభు, మధురై, రామేశ్వరం, విష్ణుకంచి, శివకంచి, జోగుళాంబ పదియాత్రల దర్శనం అనంతరం 18న గోదావరిఖనికి చేరుకుంటుందని అన్నారు. ఈ యాత్రలకు పెద్దలకు రూ.8వేలు, పిల్లలకు రూ.6వేలు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సర్వీసులకు 56789, 89898 నంబర్లతో రిజర్వేషన్‌లో ఉంచనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల భక్తులు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 7382847596, 7013504982 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న జమ్మికుంట పోలీసులు



వాహనంలో ధాన్యం బస్తాలు ఎక్కిస్తున్న ఎస్ఐ సతీష్, సిబ్బంది

జమ్మికుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి మార్కెట్ యార్డుకు ఓ రైతు ధాన్యం బస్తాలు తీసుకువెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బస్తాలు కింద పడిపోయాయి. అందరు చూస్తూ వెళ్తున్నారు తప్ప రైతులకు ఎవరూ సాయం చేయడం లేదు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ వెంటనే స్పందించి ఎస్ఐ సతీష్‌తో పాటు సిబ్బందిని సంఘటన స్థలం వద్దకు పంపించాడు. రైతు పరిస్థితి చూసి చలించిన ఎస్ఐ సతీష్ సిబ్బంది సహాయంతో ఓ ట్రాలీ తెప్పించి సిబ్బందితో కలిసి స్వయంగా ధాన్యం బస్తాలను అందులో వేశారు. అటు వైపుగా వెళ్తున్న ప్రజలు పోలీస్‌ల తీరు చూసి సెల్యూట్ పోలీస్ అన్నలు అంటూ వెళ్లడం విశేషం.

- మహిళా సంఘాలలోని నిరక్షరాస్యులకు చదువు
- పేదరిక నిర్మూళన సంస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు
- ఇప్పటికే గ్రామాలకు చేరిన పుస్తకాలు
- ప్రతీ సభ్యురాలిని అక్షరాస్యురాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఇంటింటా చదువు.. ఊరికి వెలుగు



సైదాపూర్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యా శాఖ నవ భారత సాక్షరతా కార్యక్రమం ప్రారంభించింది. మొదట పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఉల్లాస్ (చదువుకుందాం రండి...చదువు నేర్పుదాం పదండి) అనే కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా వీవోఏల ద్వారా మహిళా సంఘాలలోని నిరక్ష రాస్యులను గుర్తించారు. వారికి స్వచ్ఛందంగా చదువు నేర్పేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. సైదాపూర్ మండలంలో 39 గ్రామ పంచాయతీలుండగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 864 మహిళా సంఘాలున్నాయి. అందులో 3,100 మంది నిరక్షరాస్యులైన సభ్యులను గుర్తించారు. వారికి చదువు నేర్పేందుకు 274 మంది వంటీర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిరక్షరాస్యులకు చదువు నేర్పేందుకు సంబంధించిన పుస్తకాలు గ్రామాలకు చేరాయి. ఆయా వలంటీర్లకు పుస్తకాలు అప్పజెప్పారు.



నిరక్షరాస్యులకు చదువు నేర్పేందుకు ప్రభుత్వం ద్వారా గ్రామాలకు వచ్చిన పుస్తకాలు

ప్రస్తుతానికి 1,200 పుస్తకాలు వచ్చాయని అవి పంచి చదువు చెప్పడం ప్రారంభిస్తామని ఏపీఎం తిరుపతి తెలిపారు. ఈ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యా పొందని 15 సంవత్సరాల పైన ఉన్న నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు రాయడం నేర్పిస్తారు. ప్రతీ సభ్యురాలిని అక్షరాష్యులుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో పేదరిక నిర్మూళన సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యాసకులు, స్వచ్ఛంద బోధకుల వివరాలు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తారు. ప్రతీ సభ్యురాలు కనీసం తన పేరు తాను రాసుకునే విధంగా, తన లెక్కలు తాను చేసుకునే విధంగా తీర్చిదిద్దుతామని ఏపీఎం తిరుపతి తెలిపారు.

నేటి నుంచి

పత్తి కొనుగోళ్లు బంద్

- జిన్నింగ్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

జమ్మికుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సడలించాలని విన్నవించుకున్నప్పటికీ ఎలాంటి స్పందన లేక పోవడంతో గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా జిన్నింగ్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దోనకొండ మల్లారెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానంలో వెసులుబాటు కల్పించి అన్ని మిల్లులకు నడిచే విధంగా అలాట్మెంట్ ఇస్తామని సీసీఐ హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా జాబ్‌వర్క్ అలాట్మెంట్ కొన్ని మిల్లులకే జరిగి మిగితా మిల్లులకు జరుగక పోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లేబర్‌కు పనిలేక తిరిగి వెళ్తున్నారన్నారు. ఎకరాకు 12 క్వింటాళ్లు ఉన్న పత్తి దిగుబడిని ఏడు క్వింటాళ్ల వరకు పరిమితం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లను నిలిపి వేస్తున్నందున రైతులు గమనించి సహకరించాలని, పత్తి తీసుకువచ్చి ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు.

ఆలయాల్లో ఘనంగా కార్తీక పూజలు



వేములవాడలో సాముహిక లక్ష దీపారాధన చేస్తున్న భక్తులు



ధర్మపురి వద్ద గోదావరిలో భక్తుల స్నానాలు



వెల్గటూరు కోటిలింగాల వద్ద గోదావరి నదిలో భక్తులు



వేములవాడలో దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గరిమా అగర్వాల్



వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి అర్చకులు జ్వాలా తోరణం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రదోషకాల పూజ చేశారు. రాత్రి 10.15గంటలకు స్వామివారికి అర్చకులు మహాపూజ చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీకమాసోత్సవంలో భాగంగా రాజరాజేశ్వర ఆలయంలో ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనుబంధ పరివార దేవతలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామి ఆలయంలో స్థానిక భక్తులకు కార్తీకపౌర్ణమి సందర్భంగా గర్భాలయ దర్శనం కల్పించినప్పటికీ ఉదయం 9గంటలకే నిలిపివేసి లఘు దర్శనం ఏర్పాటుచేశారు. కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. భీమేశ్వరాలయంలో స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించి ఆర్జిత సేవలైన నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడలో లక్షదీపోత్సవం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భీమేశ్వరాలయం, భీమేశ్వరసదన్‌లో బుధవారం రాత్రి కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, ఈవో రమాదేవి, ఎస్పీ మహేష్ బి. గీతే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీలు భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసినులకు వాయినం పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజేష్, టౌన్ సీఐ వీరప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, ఏఈ రామకృష్ణ, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, చింతపంటి కమలాకర్‌లు పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురిలో కార్తీక శోభ

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాలను దర్శించుకున్నారు. అంతకు ముందు గోదావరి నది పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. దేవాలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సౌభాగ్యం కోసం లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడికి పూజలు చేశారు. బ్రాహ్మణులకు దీప దానం చేసి కట్న కానుకలు సమర్పించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. భరణి నక్షత్రం సందర్భంగా యమధర్మరాజు ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆయుష్య హోమం జరిపారు. అనేక మంది భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి నేతృత్వంలో ధర్మపురి, బుగ్గారం, గొల్లపల్లి, బీర్‌పూర్, సారంగాపూర్ ఎస్ఐలు ఉదయ్ కుమార్, సతీష్, రాజు, కృష్ణసాగర్‌రెడ్డి, గీత బందోబస్తు చేపట్టారు. ధర్మపురి వద్ద గోదావరి హారతి 15వ రోజు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు

వెల్గటూర్ : కార్తీక పూర్ణిమ సందర్భంగా బుధవారం కోటిలింగాలకు భక్తులు పోటెత్తారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కొందరు మహిళలు దీప దానాలు చేశారు. స్నాన ఘట్టాలపై ఇసుక శివ లింగాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ ప్రాంగణం లోని కాశీ శివలింగం వద్ద అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలులు భక్తులచే పూజలు జరిపించి ఆశీర్వచనాలు అందజేశారు.ఆలయ ఈవో కాంతారెడ్డి, చైర్మన్ పూదరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉమాసాగర్ బందోబస్తు నిర్వహించారు.



ధర్మపురి ఆలయంలో బారులుతీరిన భక్తులు

కొండగట్టులో గిరిప్రదక్షిణ



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): : ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు అంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు హాజరై దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

నిర్లక్ష్యం.. నిరుపయోగం

- అపరిశుభ్రతతో కొండగట్టు ఆలయ పాత కోనేరు



బండరాళ్లతో పాత కోనేరు



పాత కోనేరులో పేరుకున్న నాచు, చెత్త

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పాత కోనేరు నిరుపయోగంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఆలయం ఈశాన్య భాగంలో నూతన కోనేరును ప్రారంభించిన అనంతరం పాత కోనేరును వినియోగించకపోవడంతో మూలన పడింది. అయితే దాన్ని చదును చేసి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత కోనేరును మూసి అభివృద్ధి చేయాల్సి ఉండగా అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బండరాళ్లతో నిండిపోగా మరికొంత ప్రాంతం చెత్త, నాచుతో దర్శనం ఇస్తోంది. సమీపంలోనే ప్రసాద తయారీ కేంద్రం ఉండడంతో భక్తులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

లీజుకు కొండగట్టు అంజన్న భూములు

- దేవస్థానం ఈవో శ్రీకాంత్‌రావు
- దేవస్థానం భూముల పరిరక్షణకు చర్యలు



మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పేరిట గల కొన్ని భూములను లీజుకు ఇవ్వనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. దేవస్థానం కార్యాలయ సమావేశం మందిరంలో ఈవో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, ఆర్జిత సేవల టికెట్ల పెంపు తదితర వాటి గురించి వివరించారు. అంజన్న పేరిట సుమారు 350 ఎకరాలకు పైగా భూములు ఉండగా అందులోని కొడిమ్యాల మండలం రాంసాగర్‌లో గల 8 ఎకరాలు, దిగువ కొండగట్టు సమీపంలోని ముత్యంపేట పరిధిలోగల 3 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వనున్నట్లు తద్వారా దేవస్థానం ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఈ మేరకు నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే దిగువ కొండగట్టులో ఆక్రమణకు గురి అయిన దేవస్థానం భూముల స్వాధీనానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

- ఆర్జిత సేవల టికెట్ల రేట్లు పెంపు

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలోని ఆర్జిత సేవల టికెట్ల రెట్లను రెట్టింపు పెంపు చేస్తూ మరిన్ని కొత్తగా ఆర్జితసేవలను ప్రారంభించనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. పెంచిన టికెట్ల ధరలను ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఈవో తెలిపారు. టికెట్ల పెంపు భారం కానుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించకుండా టికెట్ల పెంపు చేపట్టడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శాశ్వత అభిషేకం సేవను పది రెట్లు పెంచడం సరికాదని భక్తులు పేర్కొంటున్నారు.

- ప్రజా సంబంధాల విభాగం ఏర్పాటు

కొండగట్టులో భక్తులు, ప్రముఖుల సౌకర్యార్థం ప్రజాసంబందాల విభాగం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం కొండపైన గల బస్టాండ్ వద్ద నిత్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలంకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఈవోతో పాటు ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు సునీల్, హరిహరనాథ్ తదితరులు ఉన్నారు.

- పెరిగిన ఆర్జిత సేవల రుసుములు

క్రసం	ఆర్జిత సేవ	ప్రస్తుత రుసుము	పెంపుదల రుసుము	టికెట్‌పై ఇచ్చు వస్తువులు
1.	చందనం పూజ	రూ.800	రూ.1500	కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక లడ్డు
2.	అంతరాలయ దర్శనం	రూ.400	రూ.800	కండువా, రెండు కనుములు, 100గ్రా. అభిషేక లడ్డు
3.	గండదీపం	రూ.5	రూ.10	నూనె ఇవ్వబడును
4.	శాశ్వత అభిషేకం	రూ.1116	రూ.10116	పది సంవత్సరాల వరకు
5.	11 రోజుల హారతి	రూ.250	రూ.516	

నూతనంగా ప్రవేశ పెడుతున్న పూజల వివరాలు

- సుప్రభాతసేవ - రూ.1000 - ఒక కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక లడ్డు
- వడమాల భోగము - రూ.116 - 5 వడలు, లడ్డు
- మన్యసూక్త హోమం- రూ.2000 - పూజాసామగ్రి, లడ్డు
- శనిగ్రహ పీడ నివారణ - రూ.1000 కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక పూజ లడ్డు

ఆలయాలకు కార్తీక శోభ..

- ప్రత్యేక పూజలు - సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు - మొక్కులు చెల్లించుకున్న భక్తులు


సిరిసిల్లలో వ్రతంలో పాల్గొన్న దంపతులు


సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న దంపతులు


ఇల్లంతకుంటలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న మహిళలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని శివసాయి బాబా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులతో దేవాలయం కార్తిక శోభను సంతరించుకుంది. ఉదయం నుంచి భక్తులతో దేవాలయం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని గంగాధర స్వామి ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. మండలంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, గాలిపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి, అనంతగిరి, రేపాక తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధర ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, మద్దిమల్ల, రంగంపేట, కంచర్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించారు. తులసీ కల్యాణాన్ని ఘ నంగా నిర్వహించారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం తులసీమాత కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాముహిక సత్యనారాయణవ్రతాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గంగిశెట్టి మహేందర్, ఈవో శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

కాగా, వేములవాడ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం 150జంటలతో సాముహిక సాయిసత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయానికి కోరుట్ల జగదీశ్వర ఆశ్రమం మలయాళ సద్గురు జగదీశ్వరానందస్వామి విచ్చేసి అనుగ్రహ భాషణం చేసి భక్తులను ఆశీర్వదించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నామాల ఉమలక్ష్మీరాజం, ఆలయ అధ్యక్షుడు వారాల దేవయ్య, నిర్వాహకులు నాగరాజు, రాజేందర్, రమేశ్, రవీందర్‌రావు, కృష్ణస్వామి, వెంకటేశ్, భక్తులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వర స్వామి, వరదవెల్లి సమీపానగల దత్తాత్రేయుడి గుట్టపై కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆయాఆలయాల్లో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం వేళల్లో హనుమాన్ ఆలయం, బుగ్గ రాజరాజేశ్వర స్వామి, శంబులింగేశ్వర స్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం తాడురు శివాలయంతో పాటు పలు దేవాలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్తీక దీపాలు సమర్పించారు. అలాగే సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. రాంచంద్రపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం వట్టిమల్ల శ్రీశివసాయి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వడ్డెపల్లి మల్లేశం, దర్శనాల శంకర్, మేడిపల్లి మల్లికార్జున్, చేపూరి ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


అగ్రహారం అంజన్న సన్నిధిలో తులసీ కల్యాణం..


వరదవెల్లిలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


తాడూరు శివాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

ఎట్టకేలకు పూర్తి అయిన బీటీరోడ్డు నిర్మాణం

- ఆర్టీసీ బస్సులు నడిపించాలని గ్రామస్థుల విజ్ఞప్తి


చింతలకుంటపల్లె గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

ఇల్లంతకుంట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సంవత్సరాల తరబడిగా పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తి అయ్యింది. మండలంలోని చింతలకుంటపల్లె, గొల్లపల్లి గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు పది సంవత్సరాల క్రితం శిలాఫలకం వేశారు. అనేక అవాంతరాలు ఏర్పడటంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు మధ్యలో ఎర్రకుంట ఉండటం కట్ట ఇరుకుగా ఉంటడం వల్ల ఇక రోడ్డు పనులు జరుగవని గ్రామస్థులలో నిరాశ నెలకొంది. ప్రభుత్వం మారడంతో సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకవెళ్లారు. దీనితో స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. బీటీరోడ్డు నిర్మాణం రూ 3.54కోట్లుతో పూర్తి అయ్యింది. ఎర్రకుంట కట్టపై మాత్రం ఎలాంటి పనులు చేపట్టలేదు. ఇల్లంతకుంట నుంచి గొల్లపల్లె వరకు బీటీ రోడ్డు బాగా ఉన్నా కట్టపై మాత్రం పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో ఇక్కడ పనులు జరుగకపోవడానికి గల కారణాలు ఏమిటో అధికారులకే తెలియాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోడ్డు కోసం అనేక సంవత్సరాలుగా ఎదురుచూశామని రోడ్డు నిర్మాణం పూర్తి అయినందున ఆర్టీసీ బస్సులు నడుపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బస్సులు నడిపితే సౌకర్యంగా ఉంటుంది..

- బోయిన భూమేష్, చింతలకుంటపల్లె



మండలంలోని చింతలకుంటపల్లె, గొల్లపెల్ల గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం పూర్తి అయినందున ఆర్టీసీ బస్సులను నడుపాలి. రోడ్డు నిర్మాణం కోసం అనేక సంవత్సరాలుగా ఎదురుచూశాం. ఇల్లంతకుంట నుంచి హైద్రాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు చింతలకుంట గ్రామం మీదుగా వెళితే సౌలభ్యంగా ఉంటుంది. కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే అదనంగా అవుతుంది. విద్యార్థులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుంది. నాయకులు, అధికారులు కృషిచేసి ఇరు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

రంగు మారిన కల్యాణం పులిహోర..


భక్తులకు అందించిన పులిహోర

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలోని అనుబంధ దేవాలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం చేయించుకున్న భక్తులకు అందించిన పులిహోర రంగుమారింది. పార్వతీపురంలోని ఉచిత అన్నదాన సత్రంపైన ఏర్పాటుచేసిన కల్యాణవేదికలో బుధవారం స్వామివారి కల్యాణం చేయించుకున్న భక్తులకు దేవాలయం తరపున పులిహోర, సిరాను అందించడం ఆనవాయితీ. రూ.1500 టికెట్ తీసుకొని కల్యాణం చేయించుకున్న భక్తులకు పసుపు రంగుకు బదలు తెలుపురంగు పులిహోరను అందజేశారు. పులిహోర రుచిలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్‌ను సంప్రదించగా పులిహోర తయారుచేసే సమయంలో పోపు, పసుపు తదితర వస్తువులు వేసి పూర్తిగా కలుపకపోవడం వల్ల తెలుపు రంగుగా ఉందని చెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని ఆయన తెలిపారు.

రమణీయం.. వేణుగోపాలస్వామి రథోత్సవం


మంగళహారతులు సమర్పిస్తున్న మహిళలు


హాజరైన భక్తులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో పురోహితులు బిటుకూరి నవీన్‌కుమార్‌చారి, గోపాలాచారి ఆధ్వర్యంలోని పురోహితులు నిత్య ఆరాధన, సేవాకాలం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ వైభోవోపేతంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ స్వామివారు ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆలయం నుంచి శ్రీవారిని జాతర మైదానానికి తీసుకువచ్చారు. రథంపై ఉత్సవమూర్తులను ప్రతిష్టించారు. వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. లడ్డూ వేలంలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. మొదటి లడ్డును సిరిగాధ అశోక్ రూ.40,116, రెండో లడ్డును ఎర్ర భాస్కర్‌రెడ్డి రూ.19,116, మూడో లడ్డును వేముల సతీష్ రూ.15116, కొబ్బరికాయను రూ.రంజిత్‌రెడ్డి రూ.6116లకు దక్కించుకున్నారు. వేలాదిమంది రాత్రి వరకు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ రథంపై స్వామివారు పురవీధుల గుండా ఊరేగారు. రథంను లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. మండల కేంద్రంతో పాటు వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాలనుంచి ప్రజలు తరలివచ్చారు. వేణుగోపాలస్వామికి జన నీరాజనాలు పలికారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, ఆర్ఎస్ఐలు శ్రావణ్, సాయిల నేతృత్వంలోని పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆలయంలో మహా పూర్ణాహుతి, చక్రస్నానం, నాగవల్లి, ఏకాంత సేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

రోడ్డుపై గుంతలు.. ప్రమాదాలకు పిలుపులు..

- పట్టించుకోని అధికారులు - భయాందోళనలో వాహనదారులు


బద్ది పోచమ్మ వీధిలో ప్రమాదకరంగా మారిన గుంత


వేములవాడ బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంత

వేములవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలోని సీసీ రోడ్లపైన పడిన గుంతలు.. ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. పట్టణంలోని కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు, హీరోహోండా షోరూం నుంచి జర్మనీ గెస్ట్‌హౌస్‌కు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డుపై, 24వ వార్డు బద్ది పోచమ్మ ఆలయ సమీపంలో సీసీ రోడ్డుపై మ్యాన్‌హోల్ అత్యంత ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే రహదారుల్లో గుంతలు పడి ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెస్ ఆఫీస్ నుంచి బైపాస్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు గణేష్ విగ్రహాల తయారీ వద్ద గుంతపడటంతో రాత్రివేళల్లో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. బద్ది పోచమ్మ ఆలయ సమీపంలో మ్యాన్‌హోల్ తెరుచుకుని ఉండటంతో చిన్నపాటి వర్షంకు సైతం కనబడకపోవడంతో స్థానికులు పడిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టణంలోని రోడ్లపైన ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టింపులేదు

- మంత సందీప్, వేములవాడ



వేములవాడ బద్ది పోచమ్మ ఆలయ సమీపంలోని కాలనీలో సీసీ రోడ్డుపై మ్యాన్ హోల్ తెరుచుకొని ప్రమాదకరంగా మారింది. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. ఇప్పటి వరకు పట్టించుకున్నవారు లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్లపైన గుంతలను రోడ్డుపై పూడ్చి పట్టణ వాసులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిలిపివేయాలి..

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిలుపుదల చేయాలని కోరుతూ బుధవారం పలువురు నాయకులు తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. పక్కనే కళాశాలలు ఉన్నందు వల్ల విద్యుత్ రేడియేషన్‌తో విద్యార్థులకు భవిష్యత్‌లో పలు రకాల ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. లోలైన ప్రాంతం కావడం వల్ల వర్షాకాలంలో అవస్థలు తప్పవని అన్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మరో ప్రాంతంలో నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కథలాపూర్ మహేశ్, గసికంటి వేణు, ప్రసాద్, యువకులు ఉన్నారు.

ఎట్టకేలకు ‘చేప’ట్టారు..

(5వ పేజీ తరువాయి)

అంతగా ఆసక్తి చూపలేదు. సమయం దాటిపోవడంతో 50శాతానికి చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా మార్చుకున్నా దానిని కూడా పూర్తి చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. 2024-2025 సంవత్సరానికి రూ.1.59 కోట్ల విలువైన 1.41 కోట్ల చేప పిల్లల సరఫరాకు టెండర్లు పిలిచినా చివరకు 46.71 లక్షల చేపలను 324 చెరువులు కుంటల్లో వదిలారు.

జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి ఇది..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నిత్యం నీటిపై పోరాటంచేస్తూ ఉపాధిని అందుకుంటున్నారు. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 401 చెరువులు ఉన్నాయి. 168మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, 9220 మంది సభ్యులు ఉన్నారు. 48మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్‌మానేరులో చేపలు పట్టడానికి 741 మంది మత్స్యకారులకు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 251 మంది, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 52 మంది మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేశారు.

బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించిన ఎస్పీ

సిరిసిల్ల టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం కొత్త చెరువు ఎదురుగా ఏర్పాటు చేసిన విజయ్ బాక్స్ క్రికెట్‌ను ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. ఎస్పీ మహేష్ బి. గితే కలిసి సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ, బాక్స్ క్రికెట్ నిర్వాహకుడు బండారి విజయ్ క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ కౌన్సిలర్లు బుర్ర నారాయణగౌడ్, గెంట్యాల శ్రీనివాస్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు బండారి శ్రీనివాస్, చేపూరి నాగరాజు, పర్కాల అంజయగౌడ్, బుర్ర చిన్న అంజయ్యగౌడ్, వికృతి పర్శరాములు, వెంకన్నగౌడ్, వైద్య శివప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదాన నిర్వాహకులకు సన్మానం

ఇల్లంతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేణుకాదేవి ఆలయంలో ప్రతిపౌర్ణమికి అన్నదానం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. ఆలయ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సుదగోని వారు అన్నదానం ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అదే విధంగా ఎంబీబీఎస్ సీటు సాధించిన బొంగోని నిశితను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కానుపాక శంకర్, గౌడ సంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్‌లతో పాటు సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఇల్లంతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం దళిత బహుజన సంఘాల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా నేటికి అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జిల్లాలో అతిపెద్ద మండలం అయిప్పటికిని అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. నాయకులకు స్థానిక సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన లేదన్నారు. రోడ్లు అన్ని గుంతలమయం అయినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 9న రాజకీయ పార్టీలకు అతీతంగా రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన సంఘాల జేఏసీ మండల కన్వీనర్ మామిడి విజయ్, నాయకులు మ్యాకల మల్లేశం, ఏనుగుల లింగన్న, సామ నర్సింహారెడ్డి, రమేష్, తిరుపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో చేపపిల్లల పంపిణీ


చేపపిల్లలను పంపిణీ చేస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి సౌజన్య, చైర్మన్ రామచంద్రం

వేములవాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని నాంపల్లి గ్రామంలో మత్స్యకార్మికులకు బుధవారం జిల్లా మత్స్యశాఖాధికారి సౌజన్య, ఫిషరిష్ చైర్మన్ చొప్పరి రామచంద్రం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈచేప పిల్లలను నాంపల్లిలోని గుడికుంట చెరువు, పెద్ద చెరువు, ఎర్రగుంట, శాలరామన్నపల్లి చెరువు నీటిలో కలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ చైర్మన్ నీలి శంకర్, వైస్‌చైర్మన్ లాల దేవయ్య, కార్యదర్శి బొజ్జ శ్రీనివాస్, నాయకులు సల్మాన్‌రెడ్డి, జెడల శ్రీనివాస్, పి. శ్రీనివాస్, కె. శ్రీనివాస్, డైరెక్టర్‌లు నీలి శివకుమార్, నీలి దేవేందర్, రాజరాం, రేగుల కనుకయ్య, అనిల్, మూట సత్యనారాయణ, నీలి దేవేందర్, హన్మంతు, రమేశ్, నరేశ్, రాజు, రేగుల నర్సయ్య సుధాకర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌కు చేరుకున్న పుణ్య పాదయాత్ర

ఎల్లారెడ్డిపేట, నవంబరు5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గోధుమకుంటలోని ఓమౌజయః శ్రీ భవతి క్షేత్రం నుంచి ఈనెల1న ఓమౌజయః ఏకోపాసన మహాధర్మం ఆధ్వర్యంలో చేపట్టిన పుణ్య పాదయాత్ర ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి బుధవారం చేరుకుంది. స్థానిక ఓ మౌజయః ప్రజ్ఞాన క్షేత్రం వద్ద పాదయాత్రకు భక్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పరమోజీ త్రిగుణాత్మక సిద్ధ, పరమోజీ బ్రహ్మ శాస్త్రజ్ఞ, పరమోజీ ఋషి ప్రజ్ఞానందస్వామిజీ, భక్తులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలో సిరిసిల్ల విద్యార్థుల ప్రతిభ

సిరిసిల్ల టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టైప్ రైటింగ్ పరీక్షలో సిరిసిల్ల పట్టణం స్టూడెంట్ టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. టైప్ రైటింగ్ ఇంగ్లీష్ హయ్యర్‌లో భూక్య హాషిక లహరి 184/200, తెలుగు లోయర్‌లో బిట్ల రోజా(183/200) రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులను సాధించారు. బుధవారం సిరిసిల్లలోని ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ మొహ్మద్ రఫీ విద్యార్థులకు అభినందించారు.

చెరువు కట్టపై ముళ్లపొదలు..


వెంకటాద్రి చెరువుపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

గంభీరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట వెంకటాద్రి చెరువు కట్టపై ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోయాయి. కట్టకు రెండు వైపులా దారి మునుకుపోయే విధంగా ముళ్లపొదలు అడ్డుగా మారాయి. కట్ట కింది భాగం నుంచి రహదారి కావడంతో కట్టపై మార్గాన్ని పట్టించుకోవడం లేదు. ప్రధానంగా వ్యవసాయ పనుల్లో భాగంగా రైతులు వెళుతుంటారు. ముళ్లపొదల కారణంగా కట్టపై నుంచి వెళ్లే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు కట్టపైన ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.